నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, ఆదివారం 4 ఆగస్టు 2024 | SANGAREDDY

సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం పెద్దగుండవెల్లిలో సాగునీరు లేక బీడుబారిన పొలాలు

సిద్దిపేట జిల్లాలో నీళ్లు లేక వెలవెలబోతున్న మల్లన్న సాగర్

అన్నదాత అయోమయం..!

- భారీ వర్షాల జాడలేదు..
- అడుగంటిన భూగర్భ జలాలు
- డెడ్ స్టోరేజీకి చేరిన రిజర్వాయర్లు
- రిజర్వాయర్లు నింపి నీళ్లిచ్చేందుకు ముందుకు రాని కాంగ్రెస్ సర్కారు
- పంటల సాగుపై అనిశ్చితి పరిస్థితి
- రిజర్వాయర్లు నింపి రైతులకు నీరివ్వాలని మంత్రి ఉత్తమ్‌కు లేఖ రాసిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సాగునీరు లేక ముందుకు సాగని ఎవుసం పనులు

గతేడాది ఈ సమయానికి నిండుకుండలా సిద్దిపేట జిల్లా మర్కూక్‌లోని కొండపోచమ్మ సాగర్

సిద్దిపేట, ఆగస్టు 3 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఈ వానకాలం సీజన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లాలో తేలికపాటి వర్షాలు తప్ప గట్టి వానలు కురవలేదు. దీంతో చెరువులు, చెక్‌డ్యామ్‌లు జలాలు లేక వెళవెళపోతున్నాయి. మరోవైపు అన్నపూర్ణ, మల్లన్నసాగర్, కొండపోచమ్మ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లలో నీరు అడుగంటి డెడ్‌స్టోరేజీకి చేరాయి. జిల్లాలో భూగర్భ జలాలు అడుగంటాయి. ఈ పరిస్థితుల్లో పంటల సాగుపై రైతులు తేల్చుకోలేక పోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రిజర్వాయర్లు నింపి రైతులకు నీరిచ్చేందుకు ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో అనిశ్చితి వాతావరణం నెలకొంది. సాగునీరు సరిగా లేక వానకాలం సాగు ముందుకు సాగడం లేదు. ఇప్పటి వరకు జిల్లాలో కేవలం వరినాట్లు 50శాతం కూడా వరినాట్లు పూర్తి కాలేదు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అన్నపూర్ణ, కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్లను బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సకాలంలో నింపి వాటి ద్వారా చెరువులు, చెక్‌డ్యామ్‌లకు నీటిని విడుదల చేయడంతో నిండుకుండలా ఉండేవి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టును నిర్వీర్యం చేసే కుట్రల్లో భాగంగా రిజర్వాయర్లలోకి నీటిని విడుదల చేయకపోవడంతో అవి నేడు డెడ్‌స్టోరేజీకి చేరాయి. ఫలితంగా భూగర్భజలాలు అడుగంటాయి. బోరుబావుల్లో నీటి నిల్వలు పడిపోయాయి. రైతులు సాగు చేద్దామంటే నీరు లేదు. పోసిన వరి నారు ముదిరిపోతున్నది. దీంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. రిజర్వాయర్లను నింపాలని రైతులు డిమాండ్ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా రైతులకు సాగునీరు ఇవ్వాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శనివారం మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు లేఖ రాశారు. సాగునీటికి రైతులు ఇబ్బందుల ఎదుర్కొంటున్నారని లేఖలో పేర్కొన్నారు. గతేడాది ఇదే ఆగస్టు నెలలో అన్నపూర్ణ(అనంతగిరి) రిజర్వాయర్‌లో 3.32 టీఎంసీలు నీళ్లు ఉంటే, ప్రస్తుతం 0.75 టీఎంసీలు, రంగనాయకసాగర్‌లో 2.38 టీఎంసీలకు ప్రస్తుతం 0.67 టీఎంసీలు, మల్లన్నసాగర్ 18 టీఎంసీలకు ప్రస్తుతం 8.5 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 10 టీఎంసీలకు ప్రస్తుతం 4.5 టీఎంసీల నీళ్లు మాత్రమే ఉన్నట్లు లేఖలో పేర్కొన్నారు. ఒకవైపు రిజర్వాయర్లలో నీళ్లు లేక, మరోవైపు వర్షాలు కురవక రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారని, పంటలు వేయాలా వద్దా అనే అయోమయంతో రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. గతేడాదితో పోలిస్తే జిల్లాలో పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయిందని తెలిపారు. రాజకీయాలు పక్కనపెట్టి మిడ్ మానేరు అన్నపూర్ణ రిజర్వాయర్, రంగనాయక సాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్‌లకు నీటిని పంపింగ్ చేసేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా నీటిని విడుదల చేసి ఆయకట్టుకు నీళ్లందించేలా చర్యలు తీసుకోవాలని రైతులపక్షాన మంత్రిని హరీశ్‌రావు లేఖలో కోరారు.

ప్రస్తుతం కాంగ్రెస్ సర్కారులో ఎండిపోయిన సిద్దిపేట జిల్లా మర్కూక్‌లోని కొండపోచమ్మ సాగర్

వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశలేదు

తూప్రాన్, ఆగస్టు 3: వెంకటరత్నాపూర్ హల్దీవాగు ఒడ్డున రెండు ఎకరాలు, పైకిమరోచోట ఎకరం కలిపి మొత్తం మూడు ఎకరాల పొలం ఉన్నది. మరోచోట ఉన్న ఎకరం పొలానికి హల్దీవాగు నుంచే పైప్‌లైన్ వేసుకున్నాం. బోరు ఉన్నప్పటికీ వానకాలం హల్దీవాగు ప్రవహిస్తేనే మూడు ఎకరాలు పుష్కలంగా పారుతాయి లేదంటే వర్షాలు బాగా పడాలి. ఈసారి వర్షాలు సమృద్ధిగా కురుస్తాయనే ఆశలేదు. హల్దీవాగులోకి కాళేశ్వరం నీళ్లు వదిలితే వాగునీరే ఆధారంగా సాగు చేసుకుంటున్న వేలాది మంది రైతులకు ప్రయోజనం ఉంటుంది. ప్రభుత్వం స్పందించి నీటిని విడుదల చేయాలి.

- సీత కుమార్, వెంకట్‌రత్నాపూర్, తూప్రాన్ మండలం, మెదక్ జిల్లా

గోదావరి నీటిని విడుదల చేయాలి

తూప్రాన్, ఆగస్టు 3: మాకు తూప్రాన్ రామాలయం సమీపంలో ఎనిమిది ఎకరాల పొలం ఉన్నది. వర్షపు నీరు లేదా వాగు నీరే మాకు ఆధారం. కాలం కాక వానలు సరిగ్గా పడక ఇప్పుడిప్పుడే దున్నకాలు మొదలు పెట్టాం. వాగునీటిపైనే ఆశలు పెట్టుకున్నాం. హల్దీవాగులో నీళ్లు అడుగంటుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ముమ్ముందు సాగు కష్టమే. హల్దీవాగులోకి నీళ్లు వదిలితే మాతోపాటు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా తూప్రాన్ పెద్దచెరువు నిండుతది. పెద్ద చెరువు కింద ఆయకట్టు రైతులకు కూడా ప్రయోజనం ఉంటుంది. ప్రభుత్వం హల్దీవాగులోకి నీళ్లు విడుదల చేసి రైతులను ఆదుకోవాలి.

- కమ్మరి రాజు, యువ రైతు, తూప్రాన్ మండలం, మెదక్ జిల్లా

ఈ యేడు వాగులోకి నీళ్లు రాలేదు

వెల్దుర్తి, ఆగస్టు 3: రెండు, మూడేండ్ల నుంచి కాళేశ్వరం నీళ్లు హల్దీవాగు ద్వారా పారడంతో పుష్కలంగా పంటలు పండాయి. యాసంగి పంటకు నీళ్ల ఎద్దడి అయ్యేనాటికి వాగులో నీళ్లు వచ్చేవి. యాసంగితో పాటు వానకాలం పంటలకు సాగునీళ్లు అందేవి. కాలం ఎటమటం అయినా నీళ్లకు ఇబ్బంది ఉండేది కాదు. కానీ ఈ యేడు వాగులో నీళ్లు రాలేదు. వానలు సరిగ్గా పడక పోయినా నీళ్లు వదిలితే పంటలకు నీళ్ల సొలత్ అయితది.

- కొమురయ్య, రైతు, కొప్పులపల్లి, వెల్దుర్తి మండలం,మెదక్ జిల్లా

ఎండాకాలంలోనే నీళ్లు పారేది

వెల్దుర్తి, ఆగస్టు 3: గత ప్రభుత్వ హయాంలో మూడేండ్ల పాటు ఎండాకాలంలోనే నీళ్లు పారేది. యాసంగి పంటలకు నీటి ఇబ్బందులు వచ్చే సమయానికి కొండపోచమ్మసాగర్ నుంచి నీళ్లను హల్దీవాగులోకి వదిలేవారు. మండుటెండల్లో రెండు, మూడు నెలల పాటు నీళ్లు పారేది. యాసంగి పంటలకు నీటి ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకునేటోళ్లం. ఈ యేడు వాగులో నీళ్లు లేక యాసంగి పంటలకు ఇబ్బంది కావడంతోపాటు వానకాలం సాగుకు ఇబ్బంది పడాల్సి వస్తున్నది.

- మహేందర్‌రెడ్డి, రైతు, ఆరెగూడెం, వెల్దుర్తి మండలం, మెదక్ జిల్లా

కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగ ఉంటుండే..

మిరుదొడ్డి, ఆగస్టు 3 : మల్లన్నసాగర్ ప్రాజెక్టులో నీళ్లు ఉన్నంత సేపు రైతులకు ఇబ్బంది లేకుండే. బోరు, బావుల్లో భూగర్భజలాలు పెరిగాయి. కానీ ఇప్పుడు మల్లన్నసాగర్‌లో నీళ్లులేక బోర్లు పోస్తలేవు.మాజీ సీఎం కేసీఆర్ ఉన్నప్పుడు మంచిగ ఉంటుండే..ఎక్కడ చూసినా నీళ్లే కనిపించేది. సగం వానకాలం అయినా మల్లన్నసాగర్ ప్రాజెక్టులోకి ప్రభుత్వం నీళ్లు విడుదల చేయడం లేదు. సాగు నీళ్ల కోసం రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి మల్లన్నసాగర్‌లోని నీళ్లు తీసుకురావాలని కోరుతున్నా.

-కుమ్మరి చంద్రం, రైతు, మిరుదొడ్డి, సిద్దిపేట జిల్లా

వాగు నీళ్లతో రైతుకు ధీమా

వెల్దుర్తి, ఆగస్టు 3: మండుటెండల్లో వాగులో గోదావరి నీళ్లు పారితే రైతులకు ధీమా కలిగేది. పంటలకు ఎలాంటి నీళ్ల ఇబ్బంది లేదనే భరోసా వచ్చేది. సంతోషంగా పంటలు సాగు చేసేవాళ్లం. కాళేశ్వరం పూర్తి అయిన తర్వాత మూడేండ్ల పాటు ఎండాకాలం పూర్తయ్యే వరకు వాగులో నీళ్లు పారేవి. ఎండాకాలం పంటలకు, తాగడానికి నీళ్ల ఇబ్బందులు ఉండేవి కావు. కానీ ఈ ఏడాది వాగులో నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నాం. ఈసారి వరి నాటు వేద్దామంటే నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నాం. వర్షాలు లేక బావుల్లో నీళ్లు రోజురోజుకు తగ్గి పోతున్నాయి.

- ఆంజనేయులు, రైతు, ఆరెగూడెం, వెల్దుర్తి మండలం, మెదక్ జిల్లా

అంకంపేట చెరువు నిండితే పుష్కలంగా నీళ్లు

సిద్దిపేట, ఆగస్టు 3: కేసీఆర్ ప్రభుత్వ హయాంలోమల్లన్నసాగర్ నీటితో అంకంపేట చెరువును నింపారు. అప్పుడు బోరు, బావుల్లో నీళ్లు పుష్కలంగా ఉండేవి. మూడు ఎకరాల పొలం పారింది. నీళ్లు సమృద్ధిగా ఉండడంతో పైపులు వేసి ఇంకో రెండు ఎకరాల పొలం పారించా. మొన్నటి వానలకు మూడు ఎకరాల పొలం నాటువేశా. బావిలో నీళ్లు రోజురోజుకు తగ్గుతున్నాయి. నాటువేసిన పొలం కూడా పారేటట్లు లేదు. ప్రభుత్వం మల్లన్నసాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని వదిలి అంకంపేట చెరువు నింపాలి.

-దుర్గం రాజేశ్, రైతు, బచ్చాయిపల్లి, సిద్దిపేట రూరల్ మండలం, సిద్దిపేట జిల్లా

నీళ్లు లేక నాటు పెట్టలే..

సిద్దిపేట, ఆగస్టు 3: నాకు మూడున్నర ఎకరాల పొలం ఉన్నది. నీళ్లు లేక నాటు పెట్టలే. అంకంపేట చెరువులో నీళ్లు ఉంటే మా బోరు, బావుల్లో పుష్కలంగా నీళ్లు ఉంటాయి. గతంలో కేసీఆర్ ప్రభుత్వం మల్లన్నసాగర్ నీళ్లతో చెరువు నింపింది. అప్పుడు మొత్తం మూడు ఎకరాలు నాటు పెడితే పంట మంచిగా పండింది. చెరువులో నీళ్లు ఉంటే మూడు ఎకరాల పొలం పారుతుండే. రైతుల బాధను అర్థం చేసుకొని ప్రభుత్వం మల్లన్నసాగర్ కెనాల్ ద్వారా నీటిని విడుదల చేయాలి.

-వెన్నెల మల్లారెడ్డి, రైతు, అంకంపేట, సిద్దిపేట రూరల్ మండలం, సిద్దిపేట జిల్లా

మల్లన్నసాగర్‌లోకి నీళ్లు తేవాలి..

మిరుదొడ్డి, ఆగస్టు 3 :మల్లన్నసాగర్ ప్రాజెక్టులో నీళ్లు ఉంటే గ్రామాల్లోని రైతుల బతుకులు బాగు పడుతాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉండగా రైతులు ఏ కాలంలో కూడా ఇబ్బందులు పడలేదు. వానకాలంలో వరి పంట సాగు చేయాలంటే రైతులకు భయం పట్టుకున్నది. మల్లన్నసాగర్‌లోకి నీళ్లు నింపి కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేయాలి. ఇక్కడి రైతులందరూ బాగుపడతారు. లేదంటే అప్పుల్లో చిక్కుకొని ఇబ్బందులు పడక తప్పదు. ప్రభుత్వం వెంటనే మల్లన్నసాగర్‌లోకి నీళ్లు తేవాలి. ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు మల్లన్నసాగర్ కెనాల్ ద్వారా వాగులు, చెరువును నింపాలి.

-మొగుళ్ల ఐలయ్య, రైతు, మిరుదొడ్డి,సిద్దిపేట జిల్లా

మార్కెట్ రేటు చెల్లిస్తేనే భూములిస్తాం

త్రిబుల్ ఆర్ భూసర్వేను అడ్డుకున్న రైతులు

మెదక్ జిల్లా రెడ్డిపల్లిలో అధికారులతో వాగ్వాదానికి దిగుకున్న రైతులు

నర్సాపూర్, ఆగస్టు 3:మార్కెట్ ధర చెల్లించాకే తమ భూములను త్రిబుల్‌ఆర్ నిర్మాణానికి తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం మెదక్ జిల్లా నర్సాపూర్ మండలంలోని రెడ్డిపల్లిలో త్రిబుల్ ఆర్ నిర్మాణానికి భూసర్వే చేయడానికి వచ్చిన అధికారులను భూములు కోల్పోతున్న రెడ్డిపల్లి, చిన్నచింతకుంట రైతులు అడ్డుకున్నారు. సర్వేచేసే ప్రాంతంలో బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. సర్వే చేయడానికి ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి పోలీస్, సీఆర్పీ బలగాలతో రావడంతో రెడ్డిపల్లిలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడిం ది. ఈ సందర్భంగా సర్వే అధికారులు రైతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, సర్వేయర్ మొగులయ్యను సర్వే చేయకుండా రైతులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ..త్రిబుల్ ఆర్ రోడ్డు 17 గ్రామాల నుంచి వెళ్తుండగా, ఆ గ్రామాల్లోని రైతుల సహకారంతో సర్వే పూర్తి చేశామని తెలిపారు. రెడ్డిపల్లిలో మాత్రం సర్వే పనులు మిగిలిపోయినట్లు చెప్పారు. రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని, తాము ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనలు పాటిస్తామని వెల్లడించారు. ప్రస్తుత మార్కెట్ రేటు ప్రకారం భూములకు ధర కట్టించి భూసేకరణ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. తమకు 15 రోజులు సమయం కావాలని, సంబంధిత ప్రజా ప్రతినిధులను కలిసి సమస్యను పరిష్కరించుకుంటామని అధికారులకు రైతులు విజ్ఞప్తి చేశారు. దీంతో సర్వే చేయకుండానే అధికారులు వెనుతిరిగారు.

భార్య తీరుతో మనస్తాపం చెంది భర్త ఆత్మహత్య

సిద్దిపేట టౌన్, ఆగస్టు 3: అకారణంగా భార్య పోలీసులకు ఫిర్యాదు చేసిందని తీవ్ర మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. సీఐ ఉపేందర్ కథనం ప్రకారం.. సిద్దిపేటలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన కొత్త బాబు వాషింగ్ సెంటర్‌లో పని చేస్తాడు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో బాబు అన్నను పోలీసుల పట్టుకున్నారు. అన్నకు తోడుగా కొత్తబాబు స్టేషన్‌కు వెళ్లాడు. ఈ విషయమై బాబు భార్య రేణుక అతడి కుటుంబ సభ్యులను అసభ్య పదజాలంతో దూషించింది. దీంతో బాబు ,రేణుక మధ్య గొడవ చేసుకుంది. తనకు న్యాయం చేయాలని రేణుక రెండు రోజుల క్రితం పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు ఇంటికి వెళ్లి విచారణ చేశారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన బాబు పోలీస్‌స్టేషన్‌కు వచ్చే క్రమంలో మార్గమధ్యలో పురుగుల మందు తాగాడు. స్టేషన్‌కు చేరుకుని కింద పడిపోయాడు. అతడిని వెంటనే దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

పక్కాగా ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలి

వీసీలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

సిద్దిపేట నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి

మెదక్(నమస్తే తెలంగాణ)/సిద్దిపేట కలెక్టరేట్/సంగారెడ్డి కలెక్టరేట్, ఆగస్టు 3: రాష్ట్రంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ మార్చి 2025నాటికి పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ధరణి పెండింగ్ దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన ఖమ్మం కలెక్టరేట్ నుంచి, భూపాల్‌పల్లి జిల్లా ఐడీఓసీ నుంచి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. 2020నాటి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రజలకు ఇబ్బంది లేకుండా, ప్రభుత్వానికి నష్టం కలుగకుండా అధికారులు పరిష్కరించాలన్నారు. ఎక్కడా ప్రభుత్వభూమికి నష్టం కలగవద్దని, నీటి వనరులు, కాలువలు చెరువుల ఆక్రమణలకు గురికాకుండా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల స్క్రూటినీ కోసం జిల్లా కలెక్టర్లు వారి పరిధిలోని ప్రతి గ్రామానికి, మున్సిపాలిటీకి ఆర్ఐ, నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్లు వివరాలు సమర్పించాలని ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ధ్రువీకరణ కోసం ఆగస్టు మొదటి వారం నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టి రాబోయే 3 నెలల వ్యవధిలో ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలన్నారు. రెండోదశలో సదరు దరఖాస్తులు స్థానిక సంస్థల నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా, రోడ్డు వెడల్పు ఓపెన్ స్పేస్ మొదలగు నిబంధనలు లేఔట్‌లో పాటించారా అనే అంశాన్ని పరిశీలించి టౌన్ ప్లానింగ్ అధికారి ఆమోదిస్తారని, వెంటనే ఎల్ఆర్ఎ ఫీజు జనరేట్ అవుతుందని, దీనిని దరఖాస్తుదారులకు తెలియజేయాలని, ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన తర్వాత మూడోదశకు దరఖాస్తులు వెళ్తాయని మంత్రి పొంగులేటి తెలిపారు. ఎల్ఆర్ఎస్‌పై జిల్లా, మండల, మున్సిపల్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ధరణి పెండింగ్ దరఖాస్తులకు సత్వరమే పరిష్కరించాలని సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ సూచించారు. ధరణి సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా రూపొందించిన నూతన ఆర్ఓఆర్ ముసాయిదా బిల్లు-2024పై ప్రజల నుంచి పూచనలు, సలహాలు స్వీకరించేందుకు సీసీఎల్ఏ వెబ్‌సైట్ (www.ccla.telangana.gov.in) ద్వారా అవకాశం కల్పించామని వీసీలో ఆయన వెల్లడించారు. ఈనెల 2 నుంచి 23 వరకు అభిప్రాయాలను ప్రభుత్వానికి తెలియాలన్నారు. సలహాలు సూచనలకు ఈమెయిల్ (ror 2024-rev<\@>telangana.gov.in) ద్వారా తెలుపవచ్చని సూచించారు. పోస్ట్ ద్వారా కాడా ల్యాండ్ లీగల్ సెల్, సీసీఎల్ఏ కార్యాలయం, నాంపల్లి, స్టేషన్‌రోడ్, అన్నపూర్ణ హోటల్ ఎదురుగా, ఆబిడ్స్, హైదరాబాద్ 500001 చిరునామాకు పంపవచ్చని తెలిపారు. కాన్ఫరెన్స్‌లో మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీవో యాదయ్య, కమిషనర్లు, సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి, సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ ఆర్డీవోలు సదానందం, బన్సీలాల్, రామ్మూర్తి, సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అధికారులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలపై ఉక్కుపాదం మోపాలి

మల్టీజోన్-1 ఐజీ సత్యనారాయణ

సంగారెడ్డిలో మాట్లాడుతున్న సత్యనారాయణ

సంగారెడ్డి, ఆగస్టు 3: మాదకద్రవ్యాల వినియోగంపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని, నిషేధిత గుట్కా, పాన్‌మసాలా, సిగరెట్ అమ్మకాలపై నిఘా పెట్టాలని మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఆదేశించారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్ ఆయనకు స్వాగతం పలికారు. పోలీసు కార్యాలయంలో ఐజీ పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించారు. కార్యాలయ ఆవరణ, పోలీసు పరేడ్ మైదానాన్ని పరిశీలించారు. అనంతరం ఎస్పీతో కలిసి సైబర్ ల్యాబ్, పోలీసు క్యాంటీన్, వాటర్ ప్లాంట్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మీడియా తో ఐజీ మాట్లాడారు. జిల్లా ఇతర రాష్ట్రాలతో సరిహద్దులు కలిగి ఉండటంతో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. నేరాల నియంత్రణకు, శాంతిభద్రతల పరిరక్షణకు దోహదపడాలన్నారు. అన్ని ప్రధాన రోడ్లపై ప్రమాదాల నివారణకు సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు సంబంధిత యాజమాన్యాలతో మాట్లాడాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ సంజీవరావ్, డీఎస్పీలు సత్తయ్య గౌడ్, రవీందర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో సమస్యల తిష్ట

- మద్దూరులోని బాలికల హాస్టళ్లలో సమస్యలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాలికలు
- పట్టించుకోని అధికార యంత్రాంగం

మద్దూరు కస్తూర్బాలో పనిచేయని వాటర్‌ప్లాంట్

మద్దూరు(ధూళిమిట్ట), ఆగస్టు 3: సిద్దిపేట జిల్లా మద్దూరులోని బాలికల వసతి గృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ప్రభుత్వం నిర్లక్ష్యంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిరుపేద బాలికలకు మెరుగైన వసతి సౌకర్యాలను కల్పించాలనే సదుద్దేశంతో మద్దూరులో ఏర్పాటు చేసిన కస్తూర్బా పాఠశాల, బాలికల హాస్టల్‌లో సమస్యలు తాండవిస్తున్నాయి. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కస్తూర్బా పాఠశాలలో దుర్గంధం..

పాఠశాలలో 230మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారు. వీరికి పాఠశాలలోనే ప్రభుత్వం వసతి సౌకర్యాన్ని కల్పించింది. ప్రస్తుతం పాఠశాలలో మురుగు బయటకు వెళ్లే వీలు లేకపోవడంతో పాఠశాల భవనం లోపల, వెలుపల నిల్వ ఉండి దుర్గంధం వెదజల్లుతున్నది. మురుగుతో దోమలు, ఈగలు వ్యాప్తితో బాలికలు అనారోగ్యానికి గురవుతున్నారు. మురుగు బయటకు పంపించేందుకు అధికారులు చొరవ చూపడం లేదు. విద్యార్థినులకు రక్షిత మంచినీటిని అందించే వాటర్ ప్లాంట్ పాడై నెలలు గడుస్తున్నా మరమ్మతులు చేయించడం లేదు. విద్యార్థినుల స్నానానికి వేడినీళ్లు అందించేందుకు గ్లీజర్‌లు ఏర్పాటు చేసినప్పటికీ అవి పనిచేయడం లేదు. బాలికల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పాడైనప్పటికీ మరమ్మతులు చేయించడం లేదు.

సిద్దిపేట జిల్లా మద్దూరులోని బాలికల హాస్టల్

బాలికల హాస్టల్‌లో అరకొర వసతులు..

బాలికల హాస్టల్‌లో అరకొర వసతులు ఉన్నాయి. 2018లో చేపట్టిన హాస్టల్ భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో అరకొర వసతుల మధ్య విద్యార్థినులు హాస్టల్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలకు చెందిన 80మంది విద్యార్థులు ఉంటున్నారు. 50మంది మాత్రమే ఉండాల్సిన ఈ హాస్టల్‌లో పరిమితి మించి విద్యార్థినులు ఉంటున్నారు. ప్రస్తుతం హాస్టల్‌లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో బాలికల రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. సోలార్ మిషన్ పాడవ్వడంతో విద్యార్థినులకు వేడి నీళ్లు అందడం లేదు. గదుల తలుపులు, కిటికీలు శిథిలావస్థకు చేరాయి. సమస్యలకు తోడు హాస్టళ్లలో మెనూ పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలన్నీ పరిష్కరించాలని విద్యార్థినులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

వాహ్ తీజ్..

సంగారెడ్డి జిల్లా కంది మండలం మక్తతండాలో శనివారం గిరిజనులు తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. యువతులు తండాలోని దుర్గాభవానీ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిల్లలు, మహిళలు కోలాటం ఆడారు. అనంతరం నవ ధాన్యాల మొలకల బుట్టలను సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

- సంగారెడ్డి ఫొటోగ్రాఫర్, ఆగస్టు 3